క్లుప్తంగా

మణిపూర్ ఘటనపై నిరసన



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్‌లో మహిళలను వివస్త్ర చేసి అఘాయిత్యానికి పాల్పడిన అమానవీయ ఘటనపై మంగళవారం పట్టణంలో దళిత, క్రైస్తవ సంఘాలతో పాటు పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంబీ చర్చి నుండి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం సోమప్ప, వైఎస్‌ఆర్ సర్కిల్, గాంధీ నగర్, శివ సర్కిల అ మీదుగా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులుకు అందించారు. మణిపూర్ ఘటన బాధ్యులపై కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులందరికీ 'వాహన మిత్ర'

నందవరం: అర్హులైన ప్రతిఒక్కరికి 'వాహన మిత్ర' పథకం వర్తింపజేస్తామని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి, నదికైరవాడి గ్రామా ల్లో లబ్ధిదారుల నుంచి వాహన మిత్ర దరఖాస్తులను సచివాలయ సిబ్బంది స్వీకరిస్తున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో, టాక్సీ తదితర వాహనాలు కలిగి ఉండి, అన్ని అర్హత పత్రాలు ఉన్న లబ్ధిదారులకు వాహన మిత్ర పథకం వర్తిస్తుందన్నారు. ఇప్పటివరకు 43 మంది వాహనదారులు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 23 పాతవి కాగా, 20 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తులను పునఃపరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి సాయం అందే లా చూస్తామన్నారు. అర్హులు మిగిలి ఉంటే ద రఖాస్తుచేసుకోవాలని ఎంపీడీఓ వెల్లడించారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి

నందవరం: భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్ద కొత్తిలి గ్రామంలో 'జగనన్న భూ హక్కు– భూ రక్ష' పథకంలో భాగంగా రీసర్వేపై రెవెన్యూ అధికారులు రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రైతుల భూములను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరా రు. సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం నుంచి పెద్ద కొత్తిలి గ్రామంలో సమగ్ర సర్వే ప్రారంభమవుతుందన్నారు. మండలంలో ఇబ్రహీంపురం, పూలచింత, మాచాపురం, మిట్టసోమపురం గ్రామా ల్లో రీసర్వే పూర్తి చేశామని వివరించారు. సర్పంచ్ బైటిగేరి శివన్న, మాజీ సర్పంచ్ సోమన్న, వీఆర్వో రమేష్, గ్రామ సర్వేయర్లు శ్రీకాంత్, ముగతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో మైత్రి చారిటబుల్ ట్రస్టు సహకారంతో డ్రైవర్లకు మంగళవారం ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్యులు జెషన్‌అహ్మద్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఖలీల్ కంటి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దీపిక పర్యవేక్షించారు. కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామ్మోహన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో ఘనంగా వేడుకలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలో వెలసిన శ్రీ సయ్యద్ బాబాఫరీద్ దర్గాలోని స్వామి 58వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్తానే అలియా ఫక్రి సదర్‌చౌక్ హజరత్ బాబాఫరీద్ దర్గా అవరణలో నిర్వహకులు సయ్యద్‌ఖాదర్‌బాబా, సర్ఫరాజ్‌బాబాలఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా బాబాఫరీద్ సమాధికి ప్రత్యేక ఫాతేహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గా ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేయడం అపదలో ఉన్నవారి ప్రాణాలు కాపడడమేనని తెలిపారు. 30 మందికి పైగా సేవకులు రక్తదానం చేశారు.

భూములపై శాశ్వత హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ఎమ్మిగనూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 54 వేల ఎకరాల భూములను దళిత, గిరిజన, బీసీ మహిళలకు పంపిణీ చేసేందుకు పూనుకోవటం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం ఇచ్చే భూములను తరతరాలుగా వారి వారసులే అనుభవించేలా జీఓ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు అబ్రహం, భీమన్న, లక్ష్మన్న, ప్రసాద్, పోలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మూసానహళ్లిలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు



హొళగుందలో సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, నాయకులు

'జగనన్న సురక్ష' సూపర్ సక్సెస్

- దరఖాస్తుదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు
- గతంలో ఎన్నో అవస్థలు.. నేడు సులభంగా సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఎమ్మిగనూరులో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల చెంతకే సేవలందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 27, 28, 29వ వార్డు సచివాలయాల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ బజారి, వార్డు ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డిలతో కలిసి దరఖాస్తుదారులకు పలు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురక్ష కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి చెంతకే 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ఆలూరు మండలంలో సూపర్ సక్సెస్ అయ్యింది. మంగళవారం ముసానహళ్లి గ్రామంలో చివరి రోజు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ అల్లబకాష్, గ్రామ సర్పంచ్ పార్వతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు 126 ధ్రువపత్రాలు అందించారు. మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో సురక్ష పథకం కింద 3,613 దరఖాస్తులు రాగా ఇందులో 3,316 మంది అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశామన్నారు.

వెల్దుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి అన్నారు. మంగళవారం చివరిరోజుగా వెల్దుర్తి–1, 3 సచివాలయాల పరిధిలో సురక్ష కార్యక్రమం నిర్వహించి డీటీ ప్రసాద్‌రాజు, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, నాయకులు గట్టు ఆరిఫ్, వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బాపురం గ్రామాల్లో తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోని ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేశారు. మండలంలో ఇప్పటివరకు 3,340 మందికి సర్టిఫికెట్లను మంజూరుచేసినట్లు అధికారులు వెల్లడించారు. డీటీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నిరంజన్, వీఆర్వో ఈరన్న, సర్పంచ్‌లు గాదిలింగప్ప, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని పొట్లపాడులో ఈఓపీఆర్‌డీ సూర్యప్రకాష్, నెల్లిబండలో ఎంపీడీఓ గౌరీదేవి బృందాలు 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. పొట్లపాడు సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో సచివాలయం–1, 4 పరిధిలోని తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, మనోహర్ రెడ్డి పాల్గొని దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు

హొళగుంద: స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పలువురు వలంటీర్లు గైర్హాజరు కావడంపై అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ మల్లికార్జున, ఎంపీడీఓ రాధ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహించడం, ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు.

మద్దికెర: స్థానిక సచివాలయం–3లో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు.

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో మంగళవారం సర్పంచ్ వెంకటేష్ అధ్యక్షతన సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. మొత్తం 350 మందికి వివిధ సర్టిఫికెట్లును ఎంపీడీఓ రాణెమ్మ మంజూరు చేశారు.

వ్యాధుల నివారణపై ఖైదీలకు అవగాహన

పత్తికొండ రూరల్: దోమకాటు వల్ల సంభవించే వ్యాధుల నివారణపై వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పత్తికొండ సబ్ జైల్‌లో ఖైదీలకు అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులను తెలియజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ వెన్నెల, ఎంఎల్‌హెచ్‌పీ షమీమ్, ఆశావర్కర్, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

కృష్ణగిరి: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి వారిలో సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ–2 మద్దయ్య ఆదేశించారు. మంగళవారం కంబాలపాడు, కృష్ణగిరి ఉన్నత పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన ఉండాలని సూచించారు. ప్రతి తరగతిలో విద్యార్థి ప్రగతి నివేదిక తయారుచేసి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యా విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులకు అనుగుణంగా బోధన ఉండాలని సూచించారు. కాంప్లెక్స్ చైర్మన్లు కల్పన, హిదాయతుల్లా, సీఆర్పీ కృష్ణమూర్తి, రిసోర్స్ పర్సన్ కైలాష్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగించే వరకు పోరాటం

పత్తికొండ రూరల్: స్థానిక రెడ్డిబావి వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆర్యవైశ్య సంఘం తాలుకా అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్ అన్నారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులతో సరిపెడితే సహించేది లేదని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పత్తిప్రసాద్, నాయకులు వీరరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కు రాజకీయ సన్యాసం తప్పదు



నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: 2024 శాసనసభ ఎన్నికల్లో తామె గెలుస్తామన్న భ్రమలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ విహరిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఎద్దేవా చేశారు. ఆలూరులోని కర్నూలు–బళ్లారి రోడ్డు పక్కన రూ.68 లక్షలతో సీజీఎఫ్ గ్రాంటు నిధులతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం, రూ.80 లక్షలతో 18 దుకాణాలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..కుట్రలతో కాలం గడుపుతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, 2024 ఎన్నికల తర్వాత వారికి రాజకీయ సన్యాసం తప్పదని జోస్యం చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారి ఇళ్ల వద్దకే పథకాలు అందిస్తూ వారి గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. గతంలో వేదావతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన పచ్చ నేతలు ఆ తర్వాత విస్మరించడంతో తమ ప్రభుత్వ హయాంలో రూ.53 కోట్ల నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, నారాయణ, ఏరూరుశేఖర్, రంగమ్మ, మల్లికార్జునరెడ్డి, బీసీ మాదన్న, వీరేష్, తదితరులు ఉన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు కంటి పరీక్షలు చేయిస్తున్న ఆదోని ఎంవీఐ సుధాకర్‌రెడ్డి

ఆలూరు: వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలని ఆదోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సుధాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వాహనదారులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ కలిగిన వాహనాలనే కొనుగోలు చేయాలని, సమర్థవంతులైన వారిని డ్రైవర్లుగా నియమించుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, టాటా ఏసీ, అప్పి ఆటో, ఇతర వాహనడ్రైవర్లు యూనిఫాం ధరించాలన్నారు. ఆలూరు, పత్తికొండ, కోసిగి, ఎమ్మిగనూరు మండలాలకు చెందిన 30 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాహ్సన్ అహ్మద్, రాణి, టెక్నీషియన్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బ్లాక్ ప్లాంటేషన్‌ను అభివృద్ధి చేయాలి



రాళ్లదొడ్డి వద్ద బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: బ్లాక్ ప్లాంటేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడిమెట్ల పంచాయతీ పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామం వద్ద నిర్వహిస్తున్న బ్లాక్ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాంటేషన్‌లో భాగంగా ఇప్పటివరకు 300 మొక్కలు పెంచుతున్నట్లు చెప్పారు. వర్షాకాలం కావడం వల్ల మరిన్ని మొక్కలు వేస్తే ప్రాణం పోసుకుంటాయన్నారు. రైతులు తమ పొలాల గట్లపై, పొలాల్లో మొక్కలు పెంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. మొక్కలను నాటి పరిరక్షించుకోవాలన్నారు. ఎమ్మిగనూరు పరిధిలోని మొక్కల పెంపకం చాలా బాగుందని చెప్పారు. మొక్కలు పెంచుకునేందుకు ఆసక్తి గల వారికి బనవాసి ఫారం ఎన్‌ఆర్‌జీఎస్ నర్సరీ నుంచి మొక్కలు ఇప్పించాలని సిబ్బందికి సూచించారు. పండ్ల మొక్కలతో పాటు అన్ని రకాల మొక్కలను నాటుకోవాలని సూచించారు. ఏపీఓ విజయమోహన్, ఫీల్డ్‌అసిస్టెంట్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్య రాకుండా చూడాలి



ఆలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఉమాపతి

ఆలూరు రూరల్/ఆలూరు: ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో లో ఓల్టేజీ సమస్య రాకుండా చూడాలని జిల్లా విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి సూచించారు. ఆయన మంగళవారం ఆలూరులోని 33 కేవీ, హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలోని 11 కేవీ సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం ఆలూరు డీఈఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య రాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. వర్షాల వల్లే వచ్చే సాంకేతిక సమస్యలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, విద్యుత్ వైర్లు తెగిపడినా వెంటనే స్పందించాలన్నారు. నెలాఖరులోగా విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేయాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరా డీటీఆర్, కామన్ సర్వీసులకు క్యూఆర్ కోడ్‌ల ప్రక్రియ త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయితే బ్రేక్ డౌన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని చెప్పారు. ఆలూరు డీఈఈ నాగేంద్ర ప్రసాద్, ఆలూరు, హాలహర్వి ఏఈలు లోకేష్, జమ్మన్న వివిధ మండలాల లైన్‌మెన్లు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు బాసటగా సంక్షేమ పథకాలు



బొందిమడుగులలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. బొందిమడుగులలో మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులు, అధికారులు,వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ ఏయే పథకాల ద్వారా ఎంత ప్రయోజనం పొందారో వివరించారు.

సచివాలయ నిధులతో అభివృద్ధి పనులు

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.20 లక్షలు నిధులు విడుదల చేశారని ఎమ్మెల్యే శ్రీదేవి పేర్కొన్నారు. దీని వల్ల స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వీలుందన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు దోపిడీ తప్ప చేసిందేమీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇలాంటి సీఎంకు మరోసారి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేష్ స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, మండల కన్వీనర్ నాగేష్, నాగభూషణ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగనాథ్ రెడ్డి, బసిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సుంకన్న, మునిరెడ్డి, ఈశ్వరరెడ్డి, గిడ్డయ్య, మధు, రామాంజి, శ్రీనివాస్‌రెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి(43) గుండెపోటుతో మృతి చెందారు. బేకరి షాపు నడుపుకుంటూ గత కొంతకాలంగా కర్నూలులోనే నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం రమణారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.

గ్రామస్తుల రుణం తీర్చుకుంటా

ఆలూరు: తనను సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామస్తులకు చేతనైనంత సహాయం చేస్తానని హత్తిబెళగళ్ గ్రామ సర్పంచ్ షేకున్‌బీ అన్నారు. హైదారాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో ఇనిస్టూట్‌లో పనిచేస్తున్న సమీప బంధువుల సహకారంతో గ్రామస్తులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించేందుకు స్థానిక సచివాలయం నుంచి బస్సులో తీసుకెళ్లడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘం నాయుడు లక్ష్మీనారాయణ, ఈరన్న తదితరులు సర్పంచ్ షేకున్‌బీని అభినందించారు.

స్కూల్ కాంప్లెక్స్‌తో నైపుణ్యం మెరుగు

ఆలూరు రూరల్: స్కూల్ కాంప్లెక్స్ (పాఠశాల సముదాయం) గ్రూప్ డిస్కషన్‌తో ఉపాధ్యాయుల నైపుణ్యం మెరుగుపడుతుందని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి అన్నారు. మంగళవారం ఆమె ఆలూరు ప్రభుత్వ పాఠశాల–1 లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు వారి అనుభవాలు ఇతరులతో పంచుకోవాలని. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన సాగించాలన్నారు. గ్రూప్ డిస్కషన్ ద్వారా బోధన అనుభవాలు, వినూత్న బోధన పద్ధతులు పరస్పరం పంచుకునేందుకు వీలుంటుందన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లు తగ్గించడం పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యంపై చర్చించాలన్నారు. అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు. నేడు (బుధవారం) నాలుగు పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

డబ్లింగ్‌తో అంతరాయం లేకుండా రాకపోకలు



రైల్వే లైన్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌ఎస్

మద్దికెర: రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని ఇక నుంచి అంతరాయం లేకుండా రైళ్ల రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఆర్‌ఎస్ (రైల్వే సేఫ్టీ కమిషనర్) ప్రణజీవ్ సక్సేనా అన్నారు. మంగళవారం మద్దికెర రైల్వే స్టేషన్ నుంచి మల్లప్ప గేటు మీదుగా గుంతకల్లుకు వేసిన డబ్లింగ్, బైపాస్ లైన్లను ఆయన పరిశీలించారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం రైళ్ల రాకపోకలు నిర్వహిస్తామన్నారు. ఇక నుంచి రైళ్లు ఆలస్యం కాకుండా, గుంతకల్లు స్టేషన్‌లోకి వెళ్లకుండా గూడ్స్‌లు నేరుగా ముంబైకి వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. రైల్వే అధికారులు వెంట ఉన్నారు.

కూలిన మట్టిమిద్దె

వెల్దుర్తి: ఎడతెరిపిలేని చినుకులకు పట్టణంలోని 6వ వార్డులో మాలదాసరి నాగ కేశమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. ఇంట్లో ఒంటరిగా నివశిస్తున్న కేశమ్మ సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా లోపలి గది కూలిపోయింది. ఇంట్లోని వంట సామగ్రి, వ్యవసాయ పనిముట్లు ధ్వంసమయ్యాయి. రూ.50 వేలకుపైగా నష్టం వాటిల్లింది.

డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన



కృష్ణగిరి కస్తుర్బా విద్యాలయంలో డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న జీసీడీఓ సునీత

కృష్ణగిరి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకుందని జీసీడీఓ సునీత అన్నారు. స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను స్టూడెంట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ప్రభుత్వం డిజిటల్ ఐఎఫ్‌ఐ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) బోర్డులను ఏర్పాటు చేసిందని వివరించారు. డిజిటల్ క్లాసుల ద్వారా విద్యార్థులకు బోధించిన విషయాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం క్లాస్ రూంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు రుచికరమైన భోజనాన్ని అందిస్తూ వారి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చెన్నమ్మకు సూచించారు. ఈమె వెంట ఎంఈఓ–2 మద్దయ్య ఉన్నారు.

మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



ఆర్‌డీఎం మనీష్ అగర్వాల్‌ను కలిసిన నంచర్ల వాసులు

మద్దికెర: ఎన్నో ఏళ్లుగా మద్దికెర రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల ఉండేదని, కరోనా సమయం నుంచి రైళ్లు నిలపకుండా వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు గుంతకల్లు ఆర్‌డీఎం (రైల్వే డివిజనల్ మేనేజర్) మనీష్ అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆర్‌డీఎం స్థానిక రైల్వే స్టేషన్ ఇన్‌స్పెక్షన్ నిమిత్తం మద్దికెరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రాంతం నుంచి విజయవాడ, గుంటూరు.హైదరాబాద్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున ప్రయాణం చేస్తుంటారన్నారు. గతంలో నిలుపుదల ఉన్న అమరావతి–1, అమరావతి–2, కాచిగూడ రైళ్లు స్టాపింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డీఎం మాట్లాడుతూ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున, రైతు సంఘం అధ్యక్షులు గంపల వెంకటేశులు ఉన్నారు.

రైళ్లు పునరుద్ధరించాలి

చిప్పగిరి: తమ గ్రామం మీదుగా రాకపోకలు సాగించే రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ ఆర్‌డీఎం మనీష్ అగర్వాల్‌కు మంగళవారం నంచర్ల గ్రామవాసులు వినతి పత్రం అందించారు. నంచర్ల గ్రామం నుంచి గుంతకల్లుకు రైల్వే డబుల్ లైన్ నిర్మాణం పూర్తి చేసి నంచర్ల గ్రామంలో మల్లప్ప గేట్ క్యాబిన్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి వచ్చిన ఆర్‌డీఎంను నంచర్ల వాసులు కలసి కరోనా సమయంలో గ్రామం మీదుగా వెళ్లే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ భీమ, తదితరులు ఉన్నారు.